# అంతర్గతం



సుస్మితా రమణమూర్తి

అబ్రహాంతో నాకు పెద్దగా పరిచయంలేదు.

నేను తను మా-ఆఫీసు ట్రక్కులో రోజూ ఆఫీసుకి వెళ్ళి వస్తుండటంవల్ల మా పరిచయం కేవలం ముఖపరిచయమనే చెప్పొచ్చు. మా ట్రక్కులో యాభైమంది కూర్చోడానికి వుండేవి కేవలం రెండంటే రెండు పొడవాటి బెంచీలు మాత్రమే! ఆ రెండు బెంచీలు ఓ పదిమంది కూర్చోడానికి సరిపోతే—మిగతా నలభైమంది గుర్రాల్లా నిల్చుని ప్రతిరోజూ ఆఫీసుకి పదిమైళ్ళు ప్రయాణం చేయాల్సిందే!

ఈ పదిమైళ్ళ దూరానికి 'హ మే షా తమాషా' కోసం అబ్రహాంతో ఇంచు మించు

మా ట్రక్కులోని వాళ్ళంతా యేదో ఒక పేచీ పెట్టుకోవడం అలవాటు. ఇలా ఎంతకాలం నుంచి జరుగుతుందో నాకు తెలీదుగాని—నేను చేరిన మూణ్ణెల్ల నుంచి యిలా జరుగుతూనే వుంది. ఈ మధ్య మావాళ్ళు మరీ విపరీతంగా అబ్రహాంని వేపుకు తింటున్నారు.

అబ్రహాం ట్రక్కు ఎక్కేటప్పటికే ఇంచుమించు ప్రతిరోజూ రెండు బెంచీలు నిండిపోతుంటాయ్. మిగతావాళ్ళలా తనూ నిల్చోక తప్పదు. అంతవరకూ ఏ గొడవా వుండని మా ట్రక్కులో అబ్రహాం ఎక్కేం తర్వాతే గొడవ ప్రారంభం అవుతుంది!

అలాగని అబ్రహామే గొడవ చేస్తాడని కాదు. తనను చూడగానే మా వాళ్ళు కాలక్షేపం కోసం గొడవ చేయడం ప్రారంభిస్తారు.

"ఏఁవిటండోయ్! ఎప్పుడు కొన్నారీ షర్టు?" అంటూ ఒకరు కాలరు పట్టుకుని లాగితే—మరొకరు పేంటు జేబులోకి చిన్న చిన్న రాళ్ళను అతి చాకచక్యంగా జారవిడుస్తారు.

"రేయ్! ఎందుకైనా మంచిది. కాస్త దూరంగా వుండు. లేకుంటే అబ్రహాం జేబులోంచి రాళ్లు తీసి వాయించేయగలడు." రాళ్లు వేసిన వ్యక్తి—కాలరు లాగిన వ్యక్తికి నవ్వుతూ చెప్తాడు. దాంతో అబ్రహాం జేబులు తడుముకుని రాళ్ళను తీసి క్రింద పడేస్తే—"ఏఁవిటండీ! రాళ్ళతో మా కాళ్ళ మీద కొడ్తారు?" ఒకరు కోపంగా విసుక్కుంటారు.

ఈలోగా మరొకరు అతి చనువుగా తన భుజంమీద చిన్నగా కొడతారు. ఎవరు కొట్టిందో తెలీక—"చూడండి! జెంటిల్‌మన్! మీరుకూడా ఇలా బిహేవ్ చేయడం ఏఁవీ బాగాలేదండీ!" అని ప్రక్కనున్నతనితో తనంటే - ఆ జెంటిల్‌మన్ సీరియస్సయిపోయి—

"ఏఁవిటండీ! ఎవరు కొట్టేరో చూడకుండా మీరిలా నామీద ఫైరవ్వడం ఏఁవీబాగా లేదండీ!" అంటే—"అబ్బబ్బ! మీరు కొట్టేరనికాదండి. మీ ప్రక్కనుంచే ఎవరో కొట్టినట్లు ఫీలయానండి! కాస్త మీరు అబ్జర్వ్ చేసి నాతో చెప్పండి" అంటూ ఓ మెట్టు క్రిందికి దిగుతాడు అబ్రహాం.

"ఓయస్! దానికేఁవీ అభ్యంతరం లేదండీ! కానీ ఓ షరతు! మిమ్మల్ని ఎవరు ఎప్పుడు కొడ్తారో నేను చూసి మీకు చెప్పడానికి నాకు రోజూ కాఫీ, టిఫిన్ ఇప్పించాలి మరి. ఏఁవంటారు?" నవ్వుతూ అంటాడు తను.

అబ్రహాం మాత్రం అతనివేపు అదోలా చూస్తూ వూరుకుంటాడు.

అప్పుడప్పుడు ట్రక్కు సడన్‌బ్రేకులకి ఒకరిమీద ఒకరు బేలెన్స్ తప్పి పడటం—దొరికిన అవకాశంతో మరింతిదిగా కావాలని మావాళ్ళు అబ్రహాంమీద పడటం—తను విసుక్కోడం; చీకాకు పడటం ఇంచుమించు ప్రతిరోజూ జరుగుతుండే వ్యవహారఁవే!

ఈ గొడవకి సూత్రధారులు ముఖ్యంగా నాకు తెల్సినంతవరకూ అప్పారావ్, ప్రసాద్‌లనే చెప్పాలి. నేను ట్రక్కు మెంబరైనదగ్గర్నుంచీ వాళ్ళిద్దరినీ జాగ్రత్తగా అబ్జర్వ్ చేస్తూనే వున్నాను. అబ్రహాం దృష్టిలో మాత్రం వాళ్లిద్దరూ చాలా మంచివాళ్లు.


కాని పరోక్షంగా ట్రక్కులోని గొడవంతటికీ కారణం వాళ్ళిద్దరేనని అబ్రహాంకి తెలీదు. కొంతమందిచేత వాళ్ళే అబ్రహాంని గొడవ పట్టిస్తున్నారని అబ్రహాం గ్రహించలేకపోవడం సహజంగా చాలా విచారంగా వుంది నాకు.

మా వాళ్ళు అబ్రహాంమీద చేయి చేసుకోవడంగాని—కొట్టే పరిస్థితికి రావడం గాని చేయకపోయినా—ట్రక్కులో వున్నంతసేపు తనను ఏదో ఒక విధంగా మాటలతో యుద్ధం చేయడం మా వాళ్ళకి ప్రతిరోజూ ఓ మంచి కాలక్షేపంగా మారిపోయింది.

రోజూ పదిమైళ్ళు నిల్చుని అబ్రహాంతో ప్రయాణం చేయడం మావాళ్ళు చాలా ఈజీగా ఫీలవుతున్న విషయం నిజఁవే అయినా—పాపం అబ్రహాన్ని అంతమందీ కలసి అల్లరి చేస్తుండటం—తనెప్పుడూ వాళ్ళతో క్షణం కూడా ప్రశాంతంగా వుండక గొంతెండిపోయేలా అరుస్తుండటం—నాకు మాత్రం ఏఁవీ బాగా లేదీ వ్యవహారం.

కానీ నేనొక్కణ్ణి ఏం చేయగలను?

తోంది




ఇంచుమించు ప్రతిరోజూ నేను కూర్చునే ప్రయాణం చేస్తుంటాను. కారణం—ట్రక్కు బయల్దేరే దగ్గరే మా ఇల్లు. పోనీ అబ్రహాంకి తనే లేచి ప్రతిరోజూ సీటిస్తే?—అన్న ఆలోచన వచ్చి—ఒకటి రెండు రోజులు తనకి సీటిచ్చాను కూడా. దాంతో మా వాళ్ళంతా నన్నదోలా చూడ్డం మొదలెట్టేరు. వాళ్ళ చూపుల్ని తట్టుకోలేక ఆ మరుసటిరోజు నుంచి నేను కూడా అబ్రహాంకి సీటివ్వడం మానేశాను.

"అబ్రహాంగారూ! మీరు క్రిందటి బుధవారం సాయంత్రం ఆరుగంటల పది నిముషాలకి జగదాంబ జంక్షన్‌లో తీసుకున్న పది రూపాయలు యెప్పుడండీ యిస్తారు?" అని ఒకరు సీరియస్‌గా అడిగితే— "మీ దగ్గర నేనెప్పుడండీ తీసుకున్నాను!? ఇంతకాలం మీరు చేస్తున్న గొడవ గ్రహించాను గాని—యిక లాభంలేదు. ఈరోజు పెద్దవాళ్ళతో మీ ఇంటి కొచ్చి చెప్తాను. అప్పుడుగాని మీకు బుద్ధి రాదు" అని అబ్రహాం సీరియస్‌గా అంటాడు.

ఆ వ్యక్తి గొల్లున నవ్వుతూ అంటాడు "ఏఁవిటండోయ్! నా గురించి మా వాళ్ళతో చెప్తారా!? మా బాగుందే మీ యవ్వారం! అప్పు తీసుకుందిగాక నన్ను జడిపించడం కూడానా!? చెప్పుకోండి. ఇంతకీ ఏం చెబుతారు?"

"ఇప్పుడు చెప్పను. ఆ తర్వాత మీకే తెలుస్తుంది" అబ్రహాం.

"స్సరే! అలాగే కానీయండి" అన్నాడు ఆ వ్యక్తి.

"ఏఁవిటండీ? మీరిలా అబ్రహాన్ని గొడవ చేయడం ఏం బాగాలేదండీ! ఎంతయినా మన తండ్రిలాంటివాడు కదా అబ్రహాం? ఆ మాత్రం గౌరవం లేకుండా మాట్లాడ్డం ఏం బాగుంది. మీరైనా చెప్పండి" ప్రసాద్ పెద్దమనిషి తరహాగా ఆ వ్యక్తిని మందలిస్తాడు.

"అబ్రహాంగారూ! ఈ సారికి ఊరుకోండి. మరోసారి మిమ్మల్నేఁవైనా గొడవచేస్తే నాదీ పూచి. సరా!" అప్పారావు వారిద్దరిమధ్య సంధి ప్రయత్నం చేస్తాడు.

దాంతో అబ్రహాం మెత్తబడ్డాడు.

* * *

ఈ కథకి అసలు ముగింపే లేదు. ప్రతిరోజూ పునరావృత మయేదే యీ కథ. అబ్రహాంని మా వాళ్ళ బారినుంచి తప్పించా

అన్న ఆలోచన చాలారోజులనుంచి నాకున్నా- ఏం చెయడానికి పాలుపోక వూరుకోసాగేను నేను.

ఓరోజు ఆఫీసు అయింతర్వాత అనుకోకుండా అబ్రహాంని కల్సుకోడానికి తనింటికి వెదుక్కుంటూ వెళ్ళాను.

ఆ యింట్లో కన్పించిన దృశ్యాన్ని చూసి కొన్ని క్షణాలు నన్ను నేనే నమ్మలేక పోయాను.

అబ్రహాం—ప్రసాద్—అప్పారావు కలసి సరదాగా జోకులు వేసుకుంటూ పేకాడుకుంటున్నారు.

నన్ను చూడగానే అబ్రహాం, "ఏవిటండీ! మూర్తిగారూ! ఏవిటిలా వచ్చారు?" అంటూ కూర్చోడానికి ప్రక్కనున్న కుర్చీని చూపించేడు.

ట్రక్కులో ప్రతిరోజూ అబ్రహాంని ఏడ్పించే ప్రసాద్—అప్పారావులు వీళ్ళేనా!? అన్పించింది—నాకా క్షణంలో.

"ఏవిటండీ! మూర్తిగారూ! అలా నిల్చుండిపోయారేం? కూర్చోండి. కాస్త కాఫీ కలుపుకొస్తాను" అంటూ అబ్రహాం లేచి ప్రక్కగదిలోకి వెళ్ళబోతుంటే— "మీ రెందుకండీ లేవడం? కాఫీ నే కలుపుతాగా!" అంటూ అప్పారావు ప్రక్కగదిలోకి వెళ్ళేడు.

"అయితే మీరు కాఫీ సంగతి చూడండి. నేను టిఫిన్ సంగతి చూస్తాను" అంటూ అబ్రహాం కూడా ప్రక్క గదిలోకి వెళ్ళాడు.

ప్రసాద్ పేకముక్కలు కలుపుతూ, "మూర్తిగారూ! ఓ ఆట వేద్దాం రండి!" అన్నాడు నవ్వుతూ.

"ప్రసాద్‌గారూ! మీరేవీ అనుకోనంటే ఓ విషయం అడుగుతాను ..."

నా మాటలకి తను నవ్వుతూ అన్నాడు: "అలా సందేహిస్తారేవండీ! నేనేవీ అనుకోన్లెండి. అడగాల్సిందేదో అడగండి. మరేం ఫర్లేదు. బహుశా మీరు అడగాలనుకుంటున్నది మన అబ్రహాం గురించే అనుకుంటాను?"

మళ్ళీ ఆశ్చర్యపోవడం నా వంతే అయింది.

"ఏవిటండీ! మీరు అబ్రహాంగారి గురించేనా ఆలోచిస్తున్నారు? ప్రతిరోజూ ప్రతిక్షణం అర్థంపర్థం లేని మాటలతో అబ్రహాంని నానా గొడవ పట్టించే వీళ్ళేనా ఇప్పుడు తనతో ఇంత అన్యోన్యంగాను—యింత మర్యాదగాను వుంటున్నారూ? అన్నదే కదూ—మీ సందేహం!" ప్రసాద్ నా ముఖంలోకి చూస్తూ అడిగాడు.


నా మనసులోని మాటని ఇంతిదిగా గ్రహించిన ప్రసాద్ తెలివితేటలకి మరోసారి ఆశ్చర్యపోయాను

"అవునండి!" అన్న భావం ఉట్టిపడేలా తలూపేను.

మళ్ళీ ప్రసాద్ చెప్పడం ప్రారంభించేడు: "చూడండి, మూర్తిగారూ! సుమారు పదినెలల క్రితం ఏ తండ్రికీ యిటువంటి వయస్సులో కలగకూడని బాధ కలిగింది మన అబ్రహాం గార్కి. దాంతో తను మానసికంగా బాగా దెబ్బతిన్నారు. మెంటల్‌గా బాగా డిప్రెస్ అయ్యారు. తన బాధ చెప్పుకోడానికి—కాస్త మనసు తేలికపరచుకోడానికి యిటు బంధువులుగాని—అటు సన్నిహిత మిత్రులుగాని లేకపోవడంతో తనలో తనే కుమిలిపోయారు. అటువంటి పరిస్థితుల్లోనే ఓరోజు సాయంత్రం ముఖం తిరిగి తను మెయిన్ రోడ్డు మధ్య స్పృహ లేకుండా పడిపోవడం జరిగింది. ఆ సమయంలో నేను—మన అప్పారావు ఆ పరిసరాల్లో వుండటంవల్ల వెంటనే—అబ్రహాంని బాగా తెల్సిన డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళాం. అబ్రహాం పరిస్థితిని బాగా స్టడీ చేసింతర్వాత ఆ డాక్టరుగారు మాతో రహస్యం చెప్పినట్లు చెప్పేరు—అబ్రహాంగారు మనోవ్యాధితో చాలా బాధపడుతున్నట్లు—ఇదివరకటి కంటే వారి ఆరోగ్య పరిస్థితి పాడైనట్లూను ..."

అబ్రహాంకి కలిగిన కష్టం ఏవిటో తెల్సుకుందామని ప్రసాద్ మాటల్ని మధ్యలో త్రుంచేస్తూ నా సందేహాన్ని అడిగాను.

"ఓ, మీకు అసలు విషయం చెప్పనేలేదు కదూ? అబ్రహాంగారి బాగోగుల్ని చూసుకునేం




దుకు ఎవరూ లేరు—ఒకప్పుడు వారి ఒక్కగా నొక్క కొడుకు తప్ప. ఉద్యోగం కోసం తండ్రిని వదిలి ఓ ఏణ్ణర్థం క్రితం విజయవాడ వెళ్ళిపోయాడు. దురదృష్టవశాత్తు తను అక్కడ బస్ యాక్సిడెంటులో పోవడంతో మన అబ్రహం ఒంటరివాడైపోయాడు. అప్ప ట్నుంచి వారి పరిస్థితి బాగా దెబ్బతింది."

"ఇంతకీ ఆ డాక్టరు మీతో ఏం చెప్పేరు?'' కుతూహలంగా అడిగాను.

"ఈ వయసులో చెట్టంత కొడుకు పోవడం సామాన్యమైన విషయం కాక పోయినా—పోయినవాళ్ళకోసం ప్రతి క్షణం బాధపడి తన ఆరోగ్యం పాడుచేసుకోవడంవల్ల ప్రయోజనం శూన్యం. వసీ—తనొక్కరినీ యెప్పుడూ విడిచిపెట్టక—ఎప్పుడూ గతం గురించిన ఆలోచనలు రాకుండా తన ఆలోచ నల్ని మరోవేపు మరల్చగలిగితే తప్ప తను తిరిగి మామూలు మనిషి కాలేరని చెప్పారు.

అప్పట్నుంచి నేను, ప్రసాద్ ప్రతిక్షణం తనను యేదో ఒక విధంగా 'బిజీ'గా వుంచేం దుకు ప్రయత్నిస్తున్నాం. మా ప్రయత్నం చాలావరకు ఫలించిందని డాక్టర్‌గారే తమ సంతృప్తిని చాలాసార్లు వెల్లడించేరు" ప్రసాద్.

"అంటే మీరు ప్రతి రోజూ ట్రక్కులో?! "

నా మాటలు పూర్తి కాకుండానే ప్రసాద్

సమాధానం చెప్పేడు:

"అవునండీ! ఒక్క ట్రక్కులోనే కాదు. ఆఫీసులో కూడాను. అదృష్టవశాత్తు మేం ముగ్గురం ఒకే సెక్షన్‌వాళ్ళం కావడం—ఒకే వీధిలో వుండటంవల్ల మా ప్రయత్నం బాగా ఫలించిందని చెప్పొచ్చు. మీలా చాలా మందికి మామీద పీకలదాకా కోపం ఈపాటికే వచ్చిందని మాకు తెలియని విషయం కాదు. మనవాళ్ళందరికీ అబ్రహంగారి పరిస్థితి తెలిస్తే —మనవాళ్ళ సానుభూతి చినుకులవల్ల ప్రతి రోజూ కాకపోయినా—అప్పుడప్పుడైనా గతం గుర్తొచ్చేలా చేయడం మాకు యిష్టం లేకనే వారి పరిస్థితి యెవ్వరికీ తెలియకుండా వుంచాం."

వారి మంచితనానికి ముగ్ధుణ్ణయ్యాను.

ఎదుటి మనిషిని కష్టంలో ఆదుకున్న మంచి మనసుగల మంచి మిత్రులు కన్పించారు నాకు వాళ్ళలో.

ఇంతకాలం వారిని తప్పుగా అర్థం చేసు కున్నందుకు నన్ను నేనే నిందించుకున్నాను.

"మూర్తిగారూ! కాస్త టిఫిన్ తీసుకోండి!" అంటూ అబ్రహం—

"మూర్తిగారూ! మీకు కాఫీ రెడీ!" అంటూ అప్పారావు వచ్చేరు ప్రక్క గదిలోంచి.

ఆ మర్నాటినుంచి ప్రసాద్, అప్పారావుల తెరవెనుక నాటకంలో నే కూడా ఓ పాత్ర కాకుండా వుండలేకపోయాను —